
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 28 మే 2025



రాజధాని ప్రాంతం రాయపూడిలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి దానం చేసిన రూ.70 కోట్లు విలువ చేసే భూమి కబ్జాకు గురైంది. కబ్జాదారులు దర్జాగా ఈ భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చి పెద్ద మొత్తంలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కబ్జా చేసిన భూమిలోని 20 సెంట్ల స్థలంలో కబ్జాదారులు చర్చి నిర్మాణానికి ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.70 కోట్ల విలువైన ఆలయ భూములు కబ్జా!

తుళ్లూరు మండలం, రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానానికి 6.77 ఎకరాలు విరాళంగా ఇచ్చిన దాత



తుళ్లూరు మండలం, రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం

దాతల మరణానంతరం భూములు స్వాధీనం చేసుకున్న మహిళ

- ల్యాండ్ పూలింగ్‌కు ఆ భూములు ఇచ్చి పెద్ద మొత్తంలో ప్రభుత్వం నుంచి లబ్ధి!
- 20 సెంట్లలో చర్చి నిర్మాణానికి ప్రయత్నం.. అడ్డుకున్న స్థానికులు
- దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవని విమర్శలు

విజయవాడ (ఇంద్రకీలాద్రి), మే 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడికి చెందిన మల్లెల వెంకట రాయుడు దంపతులకు ఐదుగురు సంతానం. కుమారులు ఐదుగురికి ఆస్తులను సమానంగా పంచారు. అయితే రాయపూడి గ్రామంలోని సర్వే నెం.172/ఎలో 2.75 ఎకరాలు, 174/బిలో 2.50 ఎకరాలు, 132లో 1.52 ఎకరాలు వెరసి 6.77 ఎకరాల భూమిని గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి 1934లో విరాళంగా ఇచ్చారు. ఆ భూముల పత్రాలను మాత్రం ఆయన వద్దే ఉంచుకున్నట్టు సమాచారం. ఐదుగురు కుమారుల్లో నలుగురు వివాహాలు చేసుకోగా, ఒక కుమారుడు మల్లెల విశ్వనాథం వివాహం చేసుకోలేదు. అయితే ఆయన వయస్సు సుమారు 60 ఏళ్లు పైబడిన తర్వాత తన బాగోగులు చూసేందుకు ఓ మహిళను వివాహం చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. వెంకటరాయుడు చనిపోయిన తర్వాత విశ్వనాథం దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి పత్రాలను ఆయన వద్ద పెట్టుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. విశ్వనాథం తనంతరం ఆయన ఆస్తులకు సంబంధించిన పత్రాలతో పాటు వెంకటరాయుడు దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి పత్రాలను కూడా ఆమె తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్ర విభజన జరిగి, రాజధాని నిర్మాణానికి భూములు అవసరం కావటంతో నాటి టీడీపీ ప్రభుత్వం ప్రైవేటు భూములను కొనుగోలు చేసి వారికి పరిహారం అందజేసి, కొన్ని ప్లాట్లు కేటాయించింది. ఈ క్రమంలో దేవస్థానం భూమి పత్రాలను విశ్వనాథం వివాహం చేసుకున్న మహిళ సంబంధిత అధికారులకు భూములను ఇచ్చి పరిహారంతో పాటు ప్లాట్లు కూడా తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలువురు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పలువురు సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. శ్రీవేణుగోపాలస్వామి మిగతా 4లో..

ఆలయ భూమిలో చర్చి నిర్మాణానికి యత్నం

విశ్వనాథం భార్య పలువురు స్థానికులతో కలిసి సుమారు 20 సెంట్లు స్థలంలో చర్చి నిర్మించటానికి ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న ఫిర్యాదు దారులు స్థానికులతో కలిసి అడ్డుకున్నారు. దేవదాయ శాఖ, రెవెన్యూ, సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని ఫిర్యాదుదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, దేవదాయ శాఖ స్పందించి కబ్జాకు గురైన శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే 6.77 ఎకరాల భూమిని దేవస్థానానికి అప్పగించటంతో పాటు రికార్డుల్లో దేవస్థానం పేరు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వలివర్తిపాడులో నిషేధిత జాబితాలో చేర్చిన ప్లాట్లు

నిషేధిత జాబితా నుంచి విముక్తికి ప్రదక్షిణలు!

మాజీ ఎమ్మెల్యే నాని కక్షసాధింపుతో పలువురి అవస్థలు

- నిషేధిత భూముల జాబితాలోకి పలు సర్వే నంబర్లు
- ఆరేళ్లకు తేలిన అన్నపూర్ణమ్మ ట్రస్ట్ భూమి లెక్క
- దేవదాయ కమిషనర్, కలెక్టర్‌కు పలువురు వినతి
- సర్వే చేయాలని దేవదాయ కమిషనర్ ఆదేశాలు
- సర్వే చేయకుండా రెవెన్యూ అధికారుల తాత్సారం

ఆంధ్రజ్యోతి - గుడివాడ: గుడివాడ మండలం వలివర్తిపాడులోని సర్వే నెం.180లో 56.07 ఎకరాల్లో తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ స్టూడెంట్స్ హోమ్ ట్రస్ట్‌కు 10.27 ఎకరాలు గలదు. మిగిలిన 45.80 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందింది. దీనిలో తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో 66 మందికిపైగా మధ్య తరగతి వారికి చెందిన ప్లాట్‌లున్నాయి. ఇవీ బైపాస్ రోడ్డుకు కూతవేటు దూరంలో ఉండటంతో మాజీ మంత్రి కొడాలి నాని కన్నుపడి తన గడ్డం గ్యాంగ్ ద్వారా కబ్జా చేయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కక్షసాధింపు చర్యల్లో భాగంగా మొత్తం సర్వే నెంబరులోని భూమి అంతా నిషేధిత జాబితాలో చేర్చారు. కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి తమకు ప్లాట్‌లు చేతికి మిగతా 4లో..

లెక్క ఎప్పటికి తేలేను!

వలివర్తిపాడు సర్వే నెం.180లో వివాదంలో ఉన్న 56.07 ఎకరాల లెక్క తేల్చాలని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ గతేడాది నవంబర్‌లో ఆదేశాలు జారీ చేశారు. దేవదాయ, రెవెన్యూ అధికారులు ఈ నెల మొదటి వారంలో విచారణకు వస్తున్నట్లు ప్రకటించి నానా హడావుడి చేసి చివరికి ప్లాట్లదారులకు హ్యాండ్ ఇచ్చారు. ఇరుశాఖల అధికారులు సర్వే చేయకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ నేపథ్యంలో దేవదాయశాఖ, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి క్షేత్రస్థాయిలో పరిశీలించి విజయవాడకు చెందిన తుమ్మలపల్లి అన్నపూర్ణమ్మ ట్రస్ట్‌కు కేవలం 10.27 ఎకరాల భూమి ఉన్నట్లు లెక్కతేలడంతో, నిషేధిత జాబితాలో చేర్చిన మిగిలిన 45.80 ఎకరాలను ఆ జాబితా నుంచి తొలగించాలని ప్లాట్లదారులు కోరుతున్నారు.

నేడు, రేపు జిల్లాలో భారీ వర్షాలు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



మచిలీపట్నం, మే27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ మంగళవారం హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బాలాజీ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 08672 252572 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, భారీ వర్షాలు కురిసి ఎక్కడైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే ఈ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. కంట్రోల్ రూమ్‌లో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

ఆయన రూటే సపరేటు!

కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ తీరుపై విమర్శలు

- వైసీపీ ప్రభుత్వంలో డిప్యుటేషన్‌పై 'హయ్యర్ ఎడ్యుకేషన్'కు..
- ముగిసిన రెండేళ్ల డిప్యుటేషన్.. విధుల్లో చేరని ప్రొఫెసర్
- రెండు నెలల్లో మూడు సార్లు లేఖలు రాసిన వర్సిటీ అధికారులు
- స్పందించని ప్రొఫెసర్ తీరుపై సర్వత్రా విమర్శలు



కృష్ణా యూనివర్సిటీలో ఓ ప్రొఫెసర్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల కిందట ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీకి డెప్యుటేషన్‌పై వెళ్లిన ఆయన తన డెప్యుటేషన్ గడువు ముగిసి రెండు నెలలు గడిచినా తిరిగి విధుల్లో చేరలేదు. దీంతో వర్సిటీ రిజిస్ట్రార్ మూడు సార్లు సదరు ప్రొఫెసర్‌కు యూనివర్సిటీకి వచ్చి విద్యార్థులకు పాఠాలు బోధించాలని లేఖలు రాశారు. అయినా ఆయన నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఐదుగురు ప్రొఫెసర్‌లు ప్రస్తుతం పనిచేస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం వారానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ 16 గంటలు, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ 14 గంటల చొప్పున పాఠాలు బోధించాలి. కానీ అసిస్టెంట్ ప్రొఫెసర్ 26 గంటలు, అసోసియేట్ ప్రొఫెసర్ 19 నుంచి 20 గంటలు పాఠాలు చెబుతున్నారు. పాఠ్యాంశాల బోధనతోపాటు యూనివర్సిటీలో పరిపాలనా పరమైన విధులను వీరు నిర్వహిస్తుండటంతో వారిపై పనిభారం అధికమవుతోంది. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఫైనాన్స్ సబ్జెక్టుకు సంబంధించి పాఠాలు బోధించే ప్రొఫెసర్ రెండు సంవత్సరాలుగా హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీకి డెప్యుటేషన్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో ఈ సబ్జెక్టులో పాఠాలు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీగా మచిలీపట్నంలోని ఒక డిగ్రీ కళాశాలలో పనిచేసే అధ్యాపకుడిని నియమించి నెట్టుకొస్తున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా నియమితులైన అధ్యాపకుడికి ఏడాదికి మిగతా 4లో..

గతంలో వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేయడంతో..

రాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి మేలు జరగలేదనే అంశంపై, అక్కడి భూమి పరిస్థితులపై గతంలో వైసీపీ ప్రభుత్వం డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను తయారు చేయించింది. ఈ ప్రాజెక్టు ఢిల్లీకి చెందిన ఒకసంస్థ పేరుతో ఉన్నా కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈ డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ఈ డీపీఆర్ తయారు చేసినందుకు గాను ప్రభుత్వం ఈ ప్రొఫెసర్ పేరున రూ.12 లక్షలకు పైగా నగదును విడుదల చేసిందని యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు చెబుతున్నారు. ఈ డీపీఆర్‌ను వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు సమర్పించడంతో రాజధాని అమరావతిలో నిర్మాణాలు నిలిచిపోవడానికి, జాప్యం జరగడానికి కారణమనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యా మండలి అధికారులు ఈ ప్రొఫెసర్‌ను హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీలో డెప్యుటేషన్‌పై నియమించారని, రెండు సంవత్సరాలుగా ఆయన అక్కడే పనిచేస్తున్నారని యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో సదరు ప్రొఫెసర్‌ను డెప్యుటేషన్‌లోనే ఉంచుతారా లేక యూనివర్సిటీకి పంపుతారా అనేది వేచి చూడాలి.



స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వచేయండి

- కలెక్టర్ బాలాజీ ఆదేశాలు 4



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం 4

వంశీ అనుచరుడు రంగా కోర్టుకు తరలింపు 6

అన్నదాతకు కడలి కష్టం

దిగువ ప్రాంత భూముల్లోకి చొచ్చుకొస్తున్న సముద్ర జలాలు

- కోడూరు మండలంలో ముంపునకు గురవుతున్న 4 వేల ఎకరాలు
- ఐదేళ్లుగా పంటలు నష్టపోతున్న అన్నదాతలు
- అక్రమ తూములు, పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణంలో జాప్యమే కారణం



పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద ఎగువకు ప్రవహిస్తున్న ఉప్పునీరు



సముద్రపు నీటితో నిండిన పంట భూములు

ఆంధ్రజ్యోతి- కోడూరు : డ్రైనేజీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కోడూరు మండలంలోని దిగువ ప్రాంత రైతులకు శాపంగా మారింది. కోడూరు ఈస్ట్ చానల్ 15, 17, 18 నెంబర్ల కాలువల కింద వేలాది ఎకరాల్లో పంట పొలాలు ఉన్నాయి. అక్రమంగా డ్రెయిన్ల తవ్వకం, తూముల ఏర్పాటు వల్ల సముద్రపు ఉప్పునీరు ఎగువకు వచ్చి సాగు భూములను ముంచేస్తుంది. వేలాది ఎకరాల సాగు భూమిని చౌడు భూములుగా మారుస్తుంది. ఈ ఉప్పునీటి ముంపునకు ప్రధాన కారణమైన పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్ల నిర్మాణం, రత్నకోడు డ్రెయిన్‌కి వేసిన అక్రమ తూములు తొలగింపు విషయంలో డ్రైనేజీ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లుగా పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నుంచి ఎగువకు వచ్చే ఉప్పునీటి కారణంగా నాలుగు వేల ఎకరాల్లో పంట వేసే పరిస్థితి లేక, వేసిన పంట చేతికి రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ ఎస్టిమేట్ ప్రత్యేకంగా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదించకుండా, పంట నష్టం మిగతా 4లో..

ఐదేళ్లుగా నష్టపోతున్నాం



గత ఐదేళ్లుగా పంటలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నాం. సముద్ర జలాలు చొచ్చుకు రావడానికి పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణంలో జాప్యమే కారణం. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి ప్రత్యేక ఎస్టిమేట్లు వేయించి పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణం వెంటనే జరిగే విధంగా చర్యలు చేపట్టాలి. -కోడూరు సాంబశివరావు, రైతు

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు ఆప్షన్ కౌన్సెలింగ్ 4

గ్రామ స్థాయిలో దెబ్బతిన్న రెవెన్యూ వ్యవస్థ

- ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు 6

ఎన్ని లక్షల మందికైనా వండి వడ్డిస్తాం

మహానాడులో పెనమలూరు క్యాటరర్ కిలారి శివాజీ 6



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.





ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

యోగతో సంపూర్ణ ఆరోగ్యం

» కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మానసిక వత్తిడి నుంచి దూరం కావచ్చని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మచిలీపట్నం గాంధీనగర్‌లోని ఏపీ యోగ సభ ఆధ్వర్యంలో ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో మంగళవారం యోగ శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ సెంటర్ నుంచి జిల్లా కోర్టు సాయి బాబా ఆలయం వరకు జరిగిన ర్యాలీలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఆర్. గంగాధరరావు, కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి కూన రాంజీ, కేయూ రిజిస్ట్రార్ ఉష, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి శర్మిష్ఠ, ఏఎస్పీ సత్యనారాయణ, డీఆర్వో చంద్రశేఖర్, ఆర్డీవో స్వాతి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గిరిజన సంక్షేమ శాఖాధికారి ధూర్జటీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు భవిరి శంకరనాథ్, రమేష్, ఐసీడీఎస్ పీడీ హరిహరనాథ్, జిల్లా



ఆయుష్ అధికారి డాక్టర్ జావెద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఏడాదిగా గాంధీనగర్‌లోని వాకర్స్ హాలులో రోజూ యోగా చేస్తున్నానని, దీనివల్ల వత్తిడి తగ్గిందన్నారు. ఉద్యోగులు యోగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 31న మంగినపూడి బీచ్‌లో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. జూన్ 2న మచిలీపట్నంలో ఆటో, లారీ ఓనర్ల అసోసియేషన్ సభ్యులు 5వేల మందితో మెగా ఈవెంట్ జరుపుతున్నామన్నారు. కూచిపూడిలో జూన్ 6న, ఘంటసాలలో 13న, మోపిదేవిలో 19న మెగా యోగాంధ్ర కార్యక్రమాలు ఉంటాయన్నారు. డ్వాక్రా మహిళలు రైతులు, యువజన సంఘాలు, ఉద్యోగులు, సీనియర్ సిటజన్లను భాగస్వామ్యం చేయాలన్నారు. జూన్ 2న వివిధ మండలాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డీడీ ఎం.వెంకటేశ్వరప్రసాద్, యోగా గురువులు చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల్లో ఓల్డ్ స్టేషన్‌పై పాయింట్లు ఇవ్వాలి

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో టీచర్లకు ఓల్డ్ స్టేషన్లపై పాయింట్లు ఇవ్వాలని డీఈవో రామారావును మంగళవారం ఏపీటీఎఫ్ నాయకులు లంకేష్, తమ్ము నాగరాజు కలిసి వినతిపత్రం సమర్పించారు. 2021 ముందు ఓల్డ్‌స్టేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కొంతమంది ఎంఈవోలు సరైన పాయింట్లు ఇవ్వడం లేదని డీఈవోకు నాయకులు ఫిర్యాదు చేశారు. మ్యూజిక్ టీచర్ల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ కావడం లేదని, ప్రిఫరెన్షియల్ కేటగిరి ప్రాధాన్యత ఇవ్వాలని, హైస్కూళ్లలో ఖాళీల వివరాలను తెలపాలని కోరారు. 8 విద్యా సంవత్సరాలు పూర్తి చేసిన వారికి పూర్తి స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్‌కుమార్, అబ్బాస్, నరేష్, సోమేశ్వరరావు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వచేయండి

» కలెక్టర్ బాలాజీ ఆదేశాలు

మచిలీపట్నం, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలాఖరునాటికి జిల్లాలోని ఆరు ఇసుకస్టాక్ పాయింట్లలో 8లక్షల టన్నుల ఇసుకను నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో జేసీ గీతాంజలిశర్మతో కలిసి మంగళవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ఇసుకకొరత లేకుండా చూసేందుకు 8లక్షల టన్నుల ఇసుకను జిల్లాలోని ఇసుకపాయింట్ల వద్ద నిల్వ చేయాలన్నారు. చోడవరం, నార్త్‌వల్లూరు, పడమటలంక, రొయ్యూరు, శ్రీకాకుళం తదితర స్టాక్ పాయింట్ల వద్ద ఇప్పటివరకు 6,15,987 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. నెలాఖరునాటికి ఇసుక నిల్వలను 8లక్షలకు చేర్చాలని అధికారులను ఆదేశించారు. టన్ను ఇసుకను రూ.155లకు



జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

విక్రయించాల్సి ఉందని, భవన నిర్మాణాలకోసం ప్రజలు ఈ ఇసుకను కొనుగోలు చేసి తీసుకువెళ్లవచ్చని ఆయన అన్నారు. జేసీ పర్యవేక్షణలో గనులు, పోలీస్, జలవనరులశాఖల అధికారులు జిల్లాలోని స్టాక్‌పాయింట్‌లను పరిశీలించి నివేదికను అందజేయాలన్నారు. పోలీసులు తరచూ స్టాక్ పాయింట్లను తనిఖీచేసి రికార్డులలో సంతకాలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సత్యనారాయణ, గనులశాఖ అధికారులు శ్రీనివాస్, కొండారెడ్డి, భూగర్భజలవనరులశాఖ ఏడీ జయవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి అభివృద్ధిపై సమీక్ష

కూచిపూడి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ బాలాజీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కూచిపూడి నాట్య పునరుజ్జీవనానికి తీసుకోవాల్సిన చర్యలు, కూచిపూడిగ్రామ అభివృద్ధికి ప్రణాళికలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. కూచిపూడికి వచ్చేపర్యాటకులు అక్కడ రెండు, మూడురోజులపాటు బస చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కూచిపూడినాట్యంలో భాగంగా ధరించే దుస్తులు, నగలు, గజ్జెలు, ఇతర నాట్యసామాగ్రి స్థానికంగానే తయారుచేసేలా గ్రామస్తులకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మార్కెటింగ్ విభాగం అధికారి పద్మారాణి, పర్యాటకశాఖ అధికారి జి.రామలక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మొవ్వ ఎంపీడీవో వి.మాధవి, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు ఆప్షన్ కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివిధ పీహెచ్‌సీ, యూహెచ్‌సీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు మంగళవారం రాత్రి రీ డిప్లాయ్‌మెంట్ కింద ఆప్షన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించవలసిన ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ రాత్రి 9.15కు ప్రారంభమైంది. కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న 73 మంది, ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న 24 మందితో పాటు ఎన్టీఆర్ జిల్లాలో పనిచేస్తున్న 67మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను మలేరియా, డెంగ్యూ ఫీవర్ అధికంగా ఉండే ప్రాంతాలకు నియామకాలు జరిగాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఒక్కొక్క పీహెచ్‌సీకి ఒక్కొక్క మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్‌ను నియమించారు. అయితే అధిక జనాభా గల ఎన్టీఆర్ జిల్లాలో నగరంలోని హాట్ స్పాట్‌లకు ఆప్షన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 5వేల నుంచి 20 వేల వరకు జనాభా ఉండే ప్రాంతాలకు డిప్యూట్ చేశారు. 4 సచివాలయాలకు ఒక్కొక్కరిని నియమించారు. కాగా ఖాళీల జాబితాలపై ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్టీఆర్ జిల్లాల మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ఆందోళన చేశారు. ఆందోళన అనంతరం డీఎంహెచ్‌వో శర్మిష్ఠతో రెండు పర్యాయాలు చర్చలకు దిగారు. స్పౌజ్ కేటగిరి, అనారోగ్యంతో బాధపడే వారి కేటగిరిల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, రాత్రి 9.15 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమయింది. కౌన్సెలింగ్‌లో డీఎంహెచ్‌వోతో పాటు కృష్ణా జిల్లా డీఎంవో బి.రామారావు, ఏలూరు జిల్లా డీఎంవో పి.ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా డీఎంవో మోతిబాబులు పాల్గొన్నారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు వారు కోరుకున్న స్థానాల్లో నియామకాలు జరిపారు.

రూ.70 కోట్ల ఆలయ భూములు కబ్జా!

(3వ పేజీ తరువాయి)

దేవస్థానానికి చెందిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని దేవదాయశాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేసినా స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారులు రెండు సంవత్సరాల క్రితం ఈ భూమిని నిషేధిత రికార్డులో నమోదు చేయించారు. ఫిర్యాదుదారుల ఒత్తిడి మేరకు దేవదాయ శాఖ అధికారులు 43 రిజిస్టర్‌లో నమోదు చేశారు. అయితే భూమిని మాత్రం స్వాధీనం చేసుకోవటంలో కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుదారులు రెవెన్యూ అధికారులను విశ్వనాథం భార్యకు ఇచ్చిన పరిహారాన్ని వెనక్కు తీసుకుని, కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి దేవస్థానానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

రికార్డుల్లో పేర్లు మార్చమని తహసీల్దార్‌కు లేఖలు

- వేణుగోపాల స్వామి దేవస్థానం ఈవో అచ్చిరెడ్డి

రాయపూడిలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానానికి ఆరు ఎకరాల 77 సెంట్ల భూమిని దాత మల్లెల వెంకటరాయుడు విరాళంగా 1934లో ఇచ్చినట్లు గిఫ్ట్ డీడ్ ఉంది. అయితే ఆ రికార్డుల గురించి దేవదాయశాఖ అధికారులకు తెలియదు. గత ఏడాది జూలైలో దేవస్థానానికి విరాళంగా ఇచ్చిన భూమి ఉన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. రికార్డులను పరిశీలిస్తే ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో భూమి ఉన్నట్లుగా తేలింది. దీంతో వారి పేర్లను తొలగించి దేవస్థానం పేరిట మ్యుటేషన్ చేయాలని స్థానిక తహసీల్దార్‌కు లేఖలు రాశాం. రెవెన్యూ వారు పట్టించుకోలేదు. సీఆర్‌డీఏ అధికారులు మాత్రం రికార్డులో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల పేరిట పూలింగ్ పరిహారంగా ప్లాట్లు, డబ్బులు ఇచ్చారు. సీఆర్‌డీఏ అధికారులకు ఈ అంశంపై దేవదాయశాఖ సహాయ కమిషనర్ లేఖరాశారు. ఇందుకు పరిహారంగా దేవదాయశాఖకు ఎకరాకు రూ.25 లక్షలు ఇస్తామని సీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు తాము అంగీకరించడం లేదు. పూలింగ్ నిబంధనల ప్రకారం ఎకరాకు వెయ్యి గజాల నివాస భూమి, కౌలు, 250 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ ఇవ్వాలని కోరాం. రెవెన్యూ అధికారులు తక్షణం రికార్డుల్లో పేర్లు మార్చి దేవస్థానానికి అప్పగిస్తూ పాస్ బుక్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

అన్నదాతకు కడలి కష్టం

(3వ పేజీ తరువాయి)

జరగని ప్రదేశాల్లో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్‌ల ఎస్టిమేట్‌లతో కలిపి ప్రభుత్వానికి నివేదిక పంపటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐదేళ్లుగా పంట నష్టపోతున్న రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అక్రమ తూములను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. దీనిపై డ్రైనేజీ శాఖ ఏఈ కరీమ్‌ను వివరణ కోరగా, పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి ప్రత్యేకంగా ఎస్టిమేట్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందించామని తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రత్నకోడు డ్రెయిన్‌కు వేసిన అక్రమ తూముల తొలగింపు చేపడతామని వివరించారు.

31న ఏపీఎన్జీవో రాష్ట్ర ఎన్నికలు

విజయవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్జీజీవో) రాష్ట్ర ఎన్నికలు మార్చి 31న విజయవాడలో జరగనున్నాయి. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో, సంఘంలో కీలకమైన పదవులకు ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా అలపర్తి విద్యాసాగర్ ఎన్నిక లాంఛనం కాగా.. ప్రధాన కార్యదర్శిగా ఎవరిని ఎన్నుకుంటారన్న దానిపై ఆసక్తిగా నెలకొంది. ప్రస్తుతం ఈ పదవిలో విద్యాసాగర్ వ్యవహరిస్తున్నారు. శివారెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో, ఏపీఎన్జీజీవో జిల్లా యూనిట్స్, ఇతర యూనిట్స్ అన్నీ ఏకగ్రీవంగా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. విజయవాడలోని శేషసాయి కళ్యాణమండపంలో ఏపీఎన్జీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలు, బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఆయన రూటే సపరేటు!

(3వ పేజీ తరువాయి)

రూ.2.50 లక్షలను జీతంగా చెల్లిస్తున్నారు. ఇది కూడా యూనివర్సిటీకి ఆర్థిక భారంగా మారింది.

మార్చి 13వ తేదీ నాటికి గడువు ముగిసినా..

యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీకి డెప్యుటేషన్‌పై వెళ్లారు. ఈ గడువు ఈ ఏడాది మార్చి 13వ తేదీతో ముగిసింది. ప్రభుత్వం ఆయన డెప్యుటేషన్‌ను పెంచుతూ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. గత 70 రోజులకుపైగా ఆయన యూనివర్సిటీకి రాలేదు. సదరు ప్రొఫెసర్ డెప్యుటేషన్ గడువును పెంచుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో యూనివర్సిటీ అధికారులు మీ డెప్యుటేషన్ గడువు ముగిసిందని, యూనివర్సిటీకి రావాలని మూడు విడతలుగా ప్రొఫెసర్‌కు లేఖలు రాశారు. ఈ లేఖలపై ఆయన నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఈ విషయంపై మరో లేఖ రాసేందుకు యూనివర్సిటీ అధికారులు సిద్ధమవుతున్నారు.

నిషేధిత జాబితా నుంచి విముక్తికి ప్రదక్షిణలు!

(3వ పేజీ తరువాయి)

వచ్చాయనే సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ఏడాదిగా కలెక్టర్, దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌ను తమకు న్యాయం చేయాలని పలు మార్లు ప్లాటుదారులు కలిసి విజ్ఞప్తి చేశారు.

సద్దుమణిగిన సరిహద్దు వివాదం

ఆరేళ్లుగా ట్రస్టుకు చెందిన స్థలం తాలుకు సరిహద్దు విషయంలో ట్రస్టుకు, ప్రైవేట్ స్థల యజమానులకు వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీన దేవదాయశాఖ, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పర్యటించారు. సర్వే పూర్తి చేసి సరిహద్దు వివాదానికి తెరదించారు. సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసి ట్రస్టుకు చెందిన 10.27 ఎకరాల సరిహద్దులను తేల్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రారంభం

ఉయ్యూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వారిని (వేస్ట్ పిక్కర్లు) ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం చేసి సాధికారితకల్పించేందుకు సమగ్ర నమోదు ప్రారంభించినట్టు ఉయ్యూరు నగర పంచాయతీ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టం (నమస్తే) పథకంలో భాగంగా వేస్ట్ పిక్కర్ల నమోదు ప్రక్రియ మంగళవారం ప్రారంభించినట్టు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి నమస్తే అనే పథకం ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునేవారు, జుట్టు సేకరించే వారికి అనధికార పారిశుధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించేందుకు తోడ్పడుతుందన్నారు. వృత్తికి ఉపయోగపడే కిట్లు ఈ పథకం ద్వారా నమోదు చేసుకున్న వారికి అందజేయనున్నట్టు తెలిపారు. చైర్మన్ వి. సత్యనారాయణ, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



కడప మహానాడు ప్రాంగణంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లతో పెనమలూరు నాయకులు



మహానాడు కిట్ అందుకుంటున్న వైవీబీ రాజేంద్రప్రసాద్, స్థానిక నాయకులు

మేము సైతం..

పసుపు పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు

పెనమలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కడపలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడులో పెనమలూరు నుంచి వెళ్లిన నాయకులు టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కలిశారు. మచిలీపట్నం పార్లమెంట్‌కు కేటాయించిన విడిది వద్ద ఆయన్ను కలిసిన నేతలు పెనమలూరు ప్రతినిధులుగా పేర్లు నమోదు చేసుకొన్నారు. కొనకళ్లను కలిసిన వారిలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అను మోలు ప్రభాకరరావు, టీడీపీ పెనమలూరు మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, కొనకళ్ల బుల్లయ్య, కుర్రా నరేంద్ర, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, శొంఠి శివరాం ప్రసాద్, వంగూరు పవన్, రావి రాకేష్, బత్తిన దాసు, నిమ్మనపూడి విజయ్‌కుమార్ ఉన్నారు.

ఉయ్యూరు : కడపలో జరుగుతున్న మహానాడు పసుపు పండుగలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఇతర నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మచిలీపట్నం పార్లమెంట్ ప్రతినిధుల నమోదు కేంద్రంలో తనపేరు నమోదు చేసుకుని మహానాడు కిట్ అందుకున్నారు. పార్టీ నాయకులు రాజులపాటి ఫణికుమార్, అజ్మతుల్లా, జంపన వీర శ్రీనివాసరావు, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తదితరులు రాజేంద్రప్రసాద్‌తో పాటు ప్రతినిధుల నమోదు కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్నారు.



మహానాడులో ఎస్ఎస్ఎల్బీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కడపలో తెలుగుదేశం పార్టీ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న 43వ మహానాడు మొదటిరోజు మంగళవారం పండుగ వాతావరణం నెలకొందని ఎస్ఎస్ఎల్బీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప మహానాడు ప్రాగణం నిండిపోయింది. ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్ల మెంట్ స్టాల్ వద్ద తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకుని కిట్లను తీసుకుని మహానాడు సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్బీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, కఠారి కోటేశ్వరరావు, లింగం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మునిసిపల్ అధికారులు

పెనమలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప డొంక రోడ్డులోని గ్రీన్ సిటీ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మునిసిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం, పరిశుభ్రత, గ్రీనరీ కోసం గ్రీన్‌సిటీ కమిటీ వారు పూనుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, కమిటీ అధ్యక్షులు శేషగిరిరావు, ఉపాధ్యక్షులు నాగరాజు, మాధవరావు, కృష్ణ పరమాత్మ, ఆనందరావు, సురేష్, నాంచారయ్య, కృష్ణప్రసాద్, కిషోర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



తాడిగడప డొంక రోడ్డులో మొక్కలు నాటుతున్న అసిస్టెంట్ కమిషనర్ కిరణ్

గడ్డివాము మీదపడి రైతు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గడ్డి వేసేందుకు నిలువ ఉంచిన గడ్డివాము వద్ద మోపు లాగుతుండగా వాములోని గడ్డిమోపులు మీదపడటంతో ఊపిరి అందక రైతు మృతి చెందిన ఘటన కానుమోలులో జరిగింది. కానుమోలుకు చెందిన రైతు చెడుగుండి సత్యనారాయణ (49) పశువుల మేత వేసేందుకు గడ్డి తీస్తూ వాములోని మోపులన్నీ మీదపడి పోవడంతో సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. వ్యవసాయం చేస్తూ పశుపోషణతో పాటు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే వారని బంధువులు తెలిపారు. వర్షాలకు గడ్డివాము తడిసి ఉండటంతో వాము పైభాగంలోని 40 మోపులన్నీ ఒక్కసారిగా మీదపడిపోవడంతో తప్పుకనే సమయం కూడా లేకపోవడం ఊపిరి ఆడక మృతి చెందాడని బంధువులు వివరించారు. స్థానిక టీడీపీ నేతలు సత్యనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



మృతుడు సత్యనారాయణ(ఫైల్)

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఉయ్యూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగా భ్యాసన ద్వారా ఆరోగ్యంగా జీవించ వచ్చని ప్రముఖ యోగా గురువులు డి.రాధాకృష్ణ మూర్తి, జి.కృష్ణ అన్నారు. యోగాంధ్ర పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, సచి వాలయ సిబ్బంది, యువకులకు మూడు సెషన్లుగా యోగాభ్యాసనలో శిక్షణ నిచ్చారు. ఎంపీడీవో శేషగిరిరావు యోగా ఉపయోగాలు వివరించారు. టి.సుస్మిత, జి.నళిని యోగా శిక్షణ నిచ్చారు. ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : యోగాంధ్ర 2025 భాగంగా బాపులపాడు మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చే వారి కి ఐదు రోజులు పాటు శిక్షణ తరగతులు మంగళవారం ఉత్సాహం ప్రారంభమయ్యాయి. స్థానిక విజయవాడ రోడ్డు లయన్స్‌క్లబ్‌లో ఈ నెల 31 వరకు నిర్వ హించనున్న శిక్షణ తరగతులకు మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, దాదాపు 190 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె జోగేశ్వరరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, మండల , రెవెన్యూ శాఖల అధికారులు పా ల్గొన్నారు. కానుమోలు ఆయుర్వేద వైద్యశాల యోగ శిక్షకులు కె. ఎస్తేర్‌రాణి, కె. ప్రవీణ్‌కుమార్, పీఈటీ కె. తానీయాగిరి శిక్షణ ఇచ్చారు.



ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాలు నేర్పుతున్న యోగా గురువు కృష్ణ



ఉంగుటూరులో యోగా అవగాహన ర్యాలీ

ఉంగుటూరు : ఆరోగ్యకర సమాజం కోసం ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని ఎంపీడీవో ఈ.సత్యకుమార్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా యోగా విశిష్టతపై మండలస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఎంపీడీవో నేతృత్వంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ఉంగుటూరు సెంటర్ వరకు యోగాంధ్ర సామూహిక ర్యాలీ నిర్వహించారు. తొలుత మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీశక్తిభవనం సమావేశం హాలులో యోగా మాస్టర్ ట్రైనీ షేక్ మౌలాలీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి యోగా శిక్షణా కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని, తహసీల్దార్ జాలాది విమలకుమారి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కంకిపాడు టీడీపీలో ముగిసిన ముసలం

కంకిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు టీడీపీలో ముసలం ముగిసింది. అలిగిన టీడీపీ నాయకులను ఓ సీనియర్ నాయకులు బుజ్జగించారు. కంకిపాడు మండల టీడీపీ అధ్యక్షుడిగా సుదిమళ్ల రవీంద్రను నియమించటంతో కంకిపాడుకు చెందిన ముగ్గురు టీడీపీ నాయకులు పార్టీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అలిగిన టీడీపీ నాయకులను బుజ్జగించే పనిని ఓ సీనియర్ నాయకుడికి అప్పగించారు. ఆ ముగ్గురు టీడీపీ నాయకులను సీనియర్ నాయకుడు సోమవారం కుర్చో పెట్టి మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై నమ్మకంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. రానున్న రోజుల్లో పదవులు అవే వస్తాయని పార్టీకి కట్టుబడి పనిచేయాలని సూచించారు. దీంతో అలకపూనిన నాయకులు కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్ శాంతించినట్లు సమాచారం.

పెరిగిన మానికొండ శివాలయం భూముల ఆదాయం

ఉంగుటూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ పరిధిలోని మానికొండ మల్లికార్జునస్వామి దేవస్థానం భూముల కౌలు వేలం మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఎండోమెంట్ అధికారులు, రైతులు, గ్రామపెద్దలు, అర్చకస్వాముల సమక్షంలో నిర్వహించారు. ఆలయానికి సంబంధించి 22.56 ఎకరాల వరిసాగు భూములను కౌలుకు లీజుకిచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలంలో పోటీ పడ్డ కౌలురైతులు గత ఏడాది కంటే ఈ ఏడాది 2,11000రూ.ల హెచ్చుకు పాట పాడారని అధికారులు తెలిపారు. కౌలు వేలం ద్వారా గత ఏడాది 3,34,000రూ.లు ఆదాయం రాగా, ఈ ఏడాది 5,45,000రూ.ల ఆదాయం లభించిందన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె. అనూరాధ, ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు, రైతులు ఆరికట్ల రవికుమార్, అనుమోలు సతీష్ కుమార్, సూరెడ్డి బుచ్చిబాబు, నర్ని యేసు తదితరులు పాల్గొన్నారు.



మానికొండ శివాలయంలో వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

సైబర్ నేరాలపై కిశోర బాలికలకు అవగాహన

ఉయ్యూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భా గంగా ఉయ్యాల స్తంభాల సెంటర్ వార్డు సచి వాలయంలో మంగళవారం సైబర్ నేరాలు, జాగ్రత్తలపై కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్ వైజర్ బేబీసరోజిని అవహన కల్పించారు. 8వ సెషన్‌లో భాగంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, వివిధ సమస్యలు ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై మహిళా సంరక్షణ కార్యదర్శి ఝాన్సీ వివరించారు. కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతి, ఆర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



వినోదం, విజ్ఞానానికి వేసవి శిక్షణ శిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లోని నైపుణ్యాన్ని పెపొందించేలా వినోదంతో కూడిన విజ్ఞానాన్ని నేర్చుకునేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి అన్నారు. వీరవల్లి గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు వేద గణితంపై అవగాహన కల్పించారు.

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లోని గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గడ్డం దీపిక కథల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ State Bank of India, RACPC,Vijayawada, వారి సంజాయిషీ పొంది ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని 1) విస్సాకోటి భాస్కరరావు గారి కుమారుడు విస్సాకోటి నాగేశ్వరరావు వీరి భార్య 2) విస్సాకోటి జ్యోతి గార్లు ది.30.03.2013రు శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం: 3051/2013రుగా రిజిష్టరు కాబడి విక్రయ దస్తావేజు రీత్యా క్రయము పొంది తదాది వారు షెడ్యూలు ఆస్తిని సర్వ సంపూర్ణ , స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు.

కాగా సదరు షెడ్యూలు ఆస్తి కి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు అయిన శ్రీ పటమట సబ్ రిజిష్టారు ఆఫీసులో ది. 24.12.1999న దస్తావేజు నెం: 4704/1999రుగా రిజిస్ట్రారు కాబడిన విక్రయ దస్తావేజు పోయినది అని తెలుపుచున్నారు.

కాగా సదరు 1) విస్సాకోటి భాస్కరరావు గారి కుమారుడు విస్సాకోటి నాగేశ్వరరావు వీరి భార్య 2) విస్సాకోటి జ్యోతి గార్లు వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని క్రయము పొందుటకు మర్రి సురేంద్ర బెనర్జీ గారి భార్య మర్రి వెంకట వీర నాగ లక్ష్మీ అరుణ కుమారి గారు ది.22.05.2025న క్రయము ఖరారు చేసికొనియున్నారు.సదరాస్తి కొనుగోలు చేయుటకు, ఋణసదుపాయం పొందుటకు, సదరాస్తి కొనుగోలు చేసిన దరిమిలా సదరు ఆస్తిని బ్యాంక్ వారికి తనఖా చేయుటకు State Bank of India, RACPC,Vijayawada, వారికి అభ్యర్థన చేసియున్నారు.

కావున ఈదిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ ఏవిధమైన హక్కులుగాని చట్టరీత్యా చెల్లదగు క్లయిములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 07 రోజుల లోపుగా లిఖిత పూర్వక ఆధారములతో తెలియపరచగలరు. సదరు గడువు తేదిలోగా చట్ట ప్రకారం చెల్లదగు ఎటువంటి అభ్యంతరములు గాని రాని యెడల మా క్లయింటు దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా స్వీకరించి ఋణ సదుపాయము కలుగజేయుదురు. అదర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయిములు గానీ, నా క్లయింటును గానీ,షెడ్యూలు ఆస్తిని గానీ, చట్టపరంగా బైండు చేయజాలవనియూ, నాక్లయింటు షెడ్యూలు ఆస్తిపై పొందె హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధి లోని , పటమట సబ్ రిజిష్టారు వారి యిలాకా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామ పంచాయితీ బోర్డు ఏరియాలో చేరిన రీ సర్వే నెం:108రు దాఖలా మాకు హక్కుగల చ.గ. 87-5లు లో పడమర వైపు చ.గ11.66లు రోడ్డు వెడల్పు నిమిత్తం పోను యింకనూ మిగిలిన చ.గ.75-84లు సిరాస్తి నివేశన స్థలంకు హద్దులు తూర్పు :- కోగంటి రమాదేవి గారి ఆస్తి, దక్షిణం: ఇసుకపల్లి కృష్ణమూర్తి గారి ఆస్తి, పడమర:అ.18.0లు వెడల్పు గలరోడ్డు, ఉత్తరం: మేడూరి వెంకట సుబ్బయ్య గారి ఆస్తి,

Vijayawda,
Dt.27/05/2025.

ఇట్లు:- నిమ్మగడ్డ శ్రీనివాసు యం.ఎ,.ఎల్, ఎల్.బి.,
డోర్ నెం: 41-3-41/1,అడ్వకేట్, బియ్యంకొట్ల బజారు, కృష్ణలంక,
విజయవాడ-13. ఫోన్స్ : 9440630396,

16 ఏళ్లకే ఎవరెస్ట్ ఎక్కిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి

» ప్రపంచంలోనే ఎత్తయిన 7 శిఖరాలు ఎక్కిన హైదరాబాదీ

» 7 సమ్మిట్ అడ్వెంచర్ పూర్తి చేసిన తొలి భారతీయుడు



హైదరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎవరెస్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన విశ్వనాథ్ కార్తికేయ పడకంటి అనే యువకుడు 16 ఏళ్లకే అధిరోహించాడు. దీంతో ప్రపంచంలోని 7 ఖండాల్లో అత్యంత ఎత్తయిన ఏడు శిఖరాలను అధిరోహించి 7 సమ్మిట్ అడ్వెంచర్‌ను పూర్తి చేశాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కుడిగా, తొలి భారతీయునిగా విశ్వనాథ్ చరిత్ర సృష్టించాడు.

సౌదీలో ఆదోని మహిళ ఇక్కట్లు

» ఆదుకున్న 'సాటా' అధ్యక్షుడు తేజ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)



కర్నూలు మహిళ ఆశాబీతో సాటా అధ్యక్షుడు తేజ

కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన 51 ఏళ్ల షేక్ ఆశాబీ ఒక ఏజెంట్‌ను నమ్మి సందర్శక వీసాపై ఏడాది క్రితం సౌదీ అరేబియాకు వచ్చింది. ఒప్పందం ప్రకారం ఉద్యోగ కాలపరిమితి ముగియగానే ఆమె స్వదేశానికి వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. వీసా గడువు ముగియడంతో సిబ్బంది ఆమెను వెనక్కి పంపించారు. దిక్కు తోచని పరిస్థితిలో ఉన్న ఆశాబీను గుర్తించిన కొందరు భారతీయులు తెలుగు ప్రవాసీ సంఘం 'సాటా' అధ్యక్షుడు పల్లెం తేజకు వివరించారు. స్పందించిన ఆయన ఆశాబీకి ఆశ్రయం కల్పించారు. వీసా ఉల్లంఘన జరిమాన చెల్లించి స్వదేశానికి పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కువైత్ అగ్ని ప్రమాదంలో మరణించిన ఆంధ్రులకు అందిన బీమా సొమ్ము

కువైత్‌లో గత ఏడాది జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన ముగ్గురు ప్రవాసాంధ్రుల కుటుంబాలతో పాటు మరో 46 ప్రవాసీ కుటుంబాలకు బీమా రూపంలో భారీ ఆర్థిక సాయం అందింది. గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం కింద సంబంధిత కంపెనీ ఈ బీమా సొమ్ము... నాలుగేళ్ల పూర్తి వేతనాన్ని సోమవారం కువైత్‌లోని మృతుల కుటుంబాలకు చెల్లించింది. బాధితుల కుటుంబాలు ఒక్కొక్కరికీ రూ.12 లక్షలు కువైత్ ప్రభుత్వం ఇప్పటికే చెల్లించింది. మృతులలో శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలానికి చెందిన తామాడ లోకనాథం, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం సత్యనారాయాణ, మీసాల ఈశ్వరుడు ఉన్నారు.

యూనియన్లదే హవా!

» నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

» వ్యవసాయ శాఖలో తీవ్ర గందరగోళం

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ బదిలీల్లో యూనియన్లకే ప్రాధాన్యం దక్కిందని, ప్రభుత్వ మార్గదర్శకాలకు పట్టించుకోలేదని విమర్శలొస్తున్నాయి. నాలుగు జోన్లలో ఏఈవోలు, ఏవోలు, ఏడీఏల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఈ బదిలీల్లో కౌన్సెలింగ్ కమిటీలు ఇష్టమొచ్చినట్లు పోస్టులు కేటాయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగుల అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌లతోపాటు మరో ముగ్గురికే ఇవ్వాల్సిన రిటెన్షన్‌లు ఇతర ఆఫీస్ బేరర్స్‌కూ ఇచ్చారు. పైగా ఒక వర్గానికి చెందినవారికే ఈ అవకాశం లభించిందని అంటున్నారు. వాస్తవంగా ఉద్యోగ సంఘాల్లో ప్రైమ్ బాడీగా ఉండే ఆరుగురు ఆఫీస్ బేరర్స్‌కు 9ఏళ్లపాటు ఎక్కడివారు అక్కడే (రిటెన్షన్) ఉండే అవకాశం ఉండగా, కార్యవర్గంలో కొందరు ఇతర పదవులు చూపి, ఐదేళ్లు దాటినా రిటెన్షన్ కోరుకుంటే.. కౌన్సెలింగ్ కమిటీలు ఆమోదం తెలిపాయి. ఉపాధ్యక్ష, ఉపకార్యదర్శి, సంయుక్త కార్యదర్శి మహిళా సంఘం వంటి పదవులు చూపుతూ కొందరు బదిలీ కాకుండా చూసుకున్నారు. చాలా జిల్లాల్లో ఆఫీస్ బేరర్‌గా ఉన్నారా? అని కౌన్సెలింగ్ కమిటీలు ముందుగానే ఉద్యోగులను అడిగి, వారికి ఐదేళ్లు దాటినా రిటెన్షన్ ఇచ్చారని చెబుతున్నారు. కానీ ఒక స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తైన ఉద్యోగి మరోచోట పోస్టింగ్ కోరుకుంటే.... అక్కడ ఖాళీ లేదు, ఇక్కడ భర్తీ అయిపోయింది, మరోచోటికి వెళ్లండి.. అంటూ కమిటీనే బదిలీలు చేసేందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాలో ఐదేళ్లు దాటినా.. ఆఫీస్ బేరర్స్‌గా ప్రాధాన్యం ఇచ్చి, బదిలీలకు అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చేశారని, అభ్యర్థన పెట్టుకోకపోయినా.. సిఫారసు లేఖలతో బదిలీలు చేసేశారని చెప్తున్నారు. గుంటూరు జిల్లాలో సాయిల్ టెస్టింగ్ ల్యాబ్, పెస్టిసైడ్స్ కంట్రోల్ ల్యాబ్, బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్, ఫర్టిలైజర్ కంట్రోల్ ల్యాబ్ ఉన్నాయి. వీటిలో 20మంది ఏవోలు ఉండగా, ఐదేళ్లు దాటిన వారిని స్టేషన్ సీనియారిటీ కింద చూడకుండా, వారిలో కొందరికి ఫ్రీజోన్‌గా చూపిన గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో పోస్టులు కేటాయిస్తున్నారు. కొన్నిచోట్ల రెండు మూడు అసోసియేషన్లు ఉన్నట్టు చూపి, వారికి కూడా ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ప్రైమ్ బాడీ కింద ఆరుగురికి రిటెన్షన్ అవకాశం ఉండగా, జోన్-2(ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలు)లో 18మందికి అవకాశం వస్తుంది. కానీ ఈ జోన్ 7 జిల్లాలు కావడంతో.. 42మందికి రిటెన్షన్ అవకాశం ఉండగా, ఈ జోన్‌లో 300మంది బదిలీలకు అవకాశం ఉంది. కానీ ఈ జోన్‌లో రెండు అసోసియేషన్లు ఉండటంతో, మూడింట ఒక వంతు పోస్టులు ఆఫీస్ బేరర్స్ కింద రిటెన్షన్‌కే పోయాయి. దీనివల్ల ఇతర ఉద్యోగులకు బదిలీ, కోరుకున్న పోస్టు రాకుండా పోతోందన్న వాదన ఉంది.

మూడేళ్లు దాటితే బదిలీ తప్పనిసరి!

» రెండేళ్లు సర్వీస్ దాటితేనే ట్రాన్స్‌ఫర్లకు అర్హత

» ఆరోగ్యశాఖ ప్రతిపాదనలకు సీఎం ఆమోదం

అమరావతి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ విధానాల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలన్న నిబంధనను సడలిస్తూ, ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసిన పాలనా సిబ్బందిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అలాగే, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి మాత్రమే బదిలీలకు అర్హత కల్పించింది. ఆర్థిక శాఖ విధానాల ప్రకారం సర్వీసు కాలంతో సంబంధం లేకుండా ఎవరైనా బదిలీ కోరవచ్చు. కానీ ప్రత్యేక అవసరాల మేరకు ఆరోగ్యశాఖ ఈ రెండేళ్ల కనీస సర్వీసు నిబంధన తీసుకుంది. ఈ మేరకు ఆరోగ్యశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను సీఎం చంద్రబాబు ఆమోదించారు. క్షేత్రస్థాయిలో రీజనల్ డైరెక్టర్లు, డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌ఎస్‌ల కార్యాలయాలతో పాటు ప్రిన్సిపాళ్లు, ఆసుపత్రుల సూపరింటెండెంట్ల కార్యాలయాల్లో సంవత్సరాలుగా పని చేస్తున్న కిందస్థాయి పాలనా సిబ్బందిపై పలు అవినీతి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దీన్ని అరికట్టడానికి ఆరోగ్యశాఖ ఈ నిర్ణయాన్ని తీసుకుంది. కాగా, డీఎంఈ పరిధిలో ఉండే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు ఉన్న ఖాళీలనే ప్రకటించి బదిలీల్లో వాటిని భర్తీ చేస్తారు. 20 రోజుల్లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వివిధ ఉద్యోగ సంఘాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న సిబ్బందిని అదే స్టేషన్లోనే వేరొక కార్యాలయానికి బదిలీ చేయనున్నారు.

88 కరువు మండలాల్లో తాగునీటికి 32 కోట్లు

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో తాగునీటి సరఫరా కోసం విపత్తు నిర్వహణ పద్దు కింద నిధులు విడుదల చేసింది. 88 మండలాల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి అవసరమైన తక్షణమే చర్యలు చేపట్టడానికి రూ.32.39 కోట్లు విడుదల చేస్తూ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద 1.55 లక్షల పంటకుంటలను తవ్వించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 50 వేల పంటకుంటలను తవ్వినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.

యోగాంధ్రాలో ఉపాధి శ్రామికులు

రాష్ట్రంలోని ఉపాధి శ్రామికులకు యోగాపై అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ శాఖ నుంచి కనీసం 20 లక్షల మందికి యోగాపై శిక్షణ అందించాలని నిర్ణయించారు.

పీఎంశ్రీకి 80 పాఠశాలలు ఎంపిక

పీఎంశ్రీ పథకానికి రాష్ట్రంలో మరో 80 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో 855 పాఠశాలలు పీఎంశ్రీ పథకంలో ఉన్నాయి.

మధ్యాహ్న భోజనంలో జూన్ నుంచి సన్నబియ్యం

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు జూన్ నుంచి మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం ప్రవేశపెడుతున్నట్లు సమగ్రశిక్ష స్టేట్ పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర సర్వీసుల్లోకి హరినారాయణ 'తాగునీరు, పరిశుద్ధ్యం' డైరెక్టర్‌గా నియామకం

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఉన్న డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ డైరెక్టర్‌గా హరినారాయణ మురుగన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు డీవోపీటీ డైరెక్టర్ పల్లవీ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

2 నెలల తర్వాత కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు

» మాజీ మంత్రి కొడాలి ఆరోగ్యంపై ప్రకటన

గుడివాడ, మే 27(ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలు ఆగండి. వైసీపీ పార్టీ శ్రేణులకు, అభిమానులకు కొడాలి నాని అందుబాటులో ఉంటారు' అని మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు.

'వ్యవసాయ' బదిలీల్లో ఉన్నతాధికారి అత్యుత్సాహం

అనంతపురం అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో వేరే జిల్లాకు చెందిన ఉన్నతాధికారి జోక్యం చేసుకోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. కౌన్సెలింగ్‌కు వెళ్లిన ఉద్యోగులు.. ఎవరు ఏ స్థానం కోరుకున్నా, 'అక్కడెందుకు నీకు? వేరేచోటుకు వెళ్లొచ్చుకదా..?' అని ప్రశ్నలు వేస్తూ బదిలీ ప్రక్రియకు ఆటంకం కలిగించారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని బాధిత ఉద్యోగులు కోరుతున్నారు.

జస్టిస్ బట్టు దేవానంద్ తిరిగి ఏపీ హైకోర్టుకు



అమరావతి, న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): జస్టిస్ బట్టు దేవానంద్‌ను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయించింది. ఈ నెల 26న సమావేశమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం జస్టిస్ దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టు నుంచి మళ్లీ ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. జస్టిస్ బట్టు దేవానంద్ 2020 జనవరి 13న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2023 మార్చిలో ఇక్కడి నుంచి మద్రాసు హైకోర్టుకు బదిలీ అయ్యారు.

అమరావతిలో కొత్త సాంకేతికతల సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయండి

» కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి నాదెండ్ల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 27(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఎమర్జింగ్ టెక్నాలజీస్ (కొత్తగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికలు) కోసం ఒక సర్టిఫికేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తమ విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) గవర్నింగ్ కౌన్సిల్ 9వ సమావేశం జరిగింది. అనంతరం మనోహర్ మీడియాతో మాట్లాడుతూ గుంటూరులో మత్స్య, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తరించి, ఫుడ్ కంట్రోలింగ్ ల్యాబ్ పరిధిలోకి తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు.

మహిళల భద్రతకు 'శక్తి' వాట్సాప్

» 79934 85111 విడుదల చేసిన డీజీపీ



శక్తి వాట్సాప్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ

అమరావతి, మే 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం.. 'శక్తి' యాప్ ద్వారా కోటిన్నర మందికి దగ్గరైన పోలీసు సేవలు ఇకపై వాట్సాప్ ద్వారా అందించబోతున్నాం. ఏ మహిళకు ఇబ్బంది వచ్చినా 79934 85111లో సంప్రదిస్తే చాలు.. వెంటనే పోలీసులు పరిష్కరిస్తారు' అని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా భరోసా ఇచ్చారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఈ నంబర్ ప్రారంభించిన డీజీపీ గుప్తా మాట్లాడుతూ.. 'మహిళలు, చిన్నారుల జోలికి వస్తే జాగ్రత్త..' అంటూ హెచ్చరించారు.

జపాన్‌తో కాదు.. చైనాతో పోటీ పడండి: రామకృష్ణ

కర్నూలు న్యూ సిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధాని మోదీ భజన చేస్తున్నారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళవారం కర్నూలులోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రపంచంలోని అనేక దేశాలతో పోల్చుకుంటే భారత్ ముందు ఉందని చంద్రబాబు, పవన్.. మోదీని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. జీడీపీలో జపాన్ కంటే ముందు ఉందని వారు చెప్పారు. మనం పోటీ పడాల్సింది జపాన్‌తో కాదని చైనాతో అని రామకృష్ణ అన్నారు.

మృతదేహాలను పోలీసులే దహనం చేయడం అమానుషం

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాల కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు ఇవ్వకుండా పోలీసులే దహనం చేయడం అమానుషమని రామకృష్ణ అన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని, ఈ ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



మహా సంబరంలో మన నాయకులు

కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో పాల్గొన్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, అనుచరగణంతో వెళుతున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, గన్నవరం, పెడన ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, సభలో పాల్గొన్న గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, మహానాడులో పాల్గొనేందుకు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి వెళ్లిన మహిళలు, సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



కడప మహానాడు భోజనశాలలో అంబికా క్యాటరర్స్ అధినేత కిలారి శివాజీతో పెనమలూరు నేతలు (కుడి నుంచి రెండో వ్యక్తి శివాజీ)


ఎన్ని లక్షల మందికైనా వండి వడ్డిస్తాం

● మహానాడులో పెనమలూరు క్యాటరర్ కిలారి శివాజీ

పెనమలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్ని లక్షల మంది మహానాడుకు వచ్చినా.. చివరి కార్యకర్తకు కూడా రుచికరమైన వంటకాలు వండి వడ్డిస్తామంటున్నారు.. పెనమలూరు అంబికా క్యాటరర్ యజమాని కిలారి శివాజీ. 15 రోజుల క్రితమే 1500 మంది సహాయకులతో మహానాడు ప్రాంగణానికి చేరుకొని వండి వడ్డించాల్సిన ప్రణాళికను, మెనూను సిద్ధం చేసుకున్నారు. మహానాడులో వంటకాలపై కిలారి శివాజీ ఏబీఎన్‌తో మాట్లాడుతూ ఏ మహానాడులోనూ లేని విధంగా కడప మహానాడులో రాయలసీమ వారికిష్టమైన మాంసాహార వంటకాలు వడ్డిస్తున్నాం. గోంగూరతో మటన్, చికెన్ కూరలు, దోస మటన్, ఉలవచారు చికెన్ లాంటి ఆంధ్రాస్టైల్ వంటకాలను అతిథులకు అందిస్తున్నామన్నారు. పెనమలూరులో అంబికా క్యాటరర్స్ ప్రారంభించిన తర్వాత ఏడోసారి మహానాడు భోజనశాలలో వంటకాలు చేస్తున్నామని గర్వంగా తెలిపారు. తమపై ఇంతటి బృహత్తర బాధ్యత పెట్టిన అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం మహానాడు భోజనశాలలో పెనమలూరు టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రాంకుమార్ అతిథులకు వడ్డించారు.

ఎన్టీఆర్‌కు కళా నీరాజనం





జగ్గయ్యపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్, చిత్రకారుడు శేఖర్ ఎన్టీఆర్ నటించిన చిత్రాల పేర్లతో ఎన్టీఆర్ చిత్రాన్ని గీశారు. అలాగే మామిడి పండుపై ఎన్టీఆర్ చిత్రాన్ని గీసి వినూత్నంగా నివాళులర్పించారు.

దద్దరిల్లిన కౌన్సిల్

మేమేమన్న దొంగలమా అంటూ వైసీపీ కౌన్సిలర్‌పై డీఈ అసహనం



కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, కూటమి కౌన్సిలర్ల మధ్య వాగ్యుద్ధం, వారిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

● సింగిల్ టెండర్లతో దోచేసున్నారన్న వైసీపీ

● అభివృద్ధి ఏమిటో త్వరలో చూస్తామంటూ చైర్మన్ చురకలు

● ఆదాయం పెంచిన కమిషనర్‌కు కౌన్సిల్ ప్రశంసలు

జగ్గయ్యపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): పేట మునిసిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. అధికారులపై కౌన్సిలర్లు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వ్యంగాస్త్రాలు, విమర్శలతో కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. అభివృద్ధి ఏమిటో త్వరలోనే చూస్తారంటూ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రతిపక్షానికి చురకలు అంటించారు. మంగళవారం జగ్గయ్యపేట పురపాలకసంఘ సమావేశం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన ఏపీజే అబ్దుల్ కలాం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగింది. అజెండాలోని 28 టెండర్లలో సింగిల్ టెండర్, ఒకే వ్యక్తివి ఆమోదం తెలపటంపై వైసీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ నిలదీశారు. రూ.70 లక్షలు విలువైన ఈ పనుల్లో సింగిల్ టెండర్లు రావటమేంటని ప్రశ్నించారు. మునిసిపల్ డీఈఈ ఖలీం వివరణ ఇస్తూ టెండర్లలో అవినీతి లేదని, మరమ్మతులకు అవసరమైన సామగ్రికి బిల్లులు చెల్లిస్తామన్నారు. మునిసిపల్ సిబ్బందే రిపేర్లు చేసినపుడు అంత మొత్తం కాదని వట్టెం అభ్యంతరం తెలిపారు. మరమ్మతులు చేశాక ఇష్టం వచ్చిన బోర్‌ను చూసుకోవచ్చని, స్థానికులైన సిబ్బందితో పనిచేయిస్తున్నందున విచారించుకోవచ్చన్నారు. మేం కౌన్సిలర్లులా మాట్లాడలేమని, మేమేమన్న దొంగలామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, చైర్మన్ రాఘవేంద్ర సర్దిచెప్పటంతో వివాదం ముగిసింది. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్స్ రూ.7కోట్లు, 15వ ఆర్థికసంఘం నిధులు రూ.కోటిన్నర, సీఆర్‌డీపీ గ్రాంట్ రూ.3కోట్లతో వచ్చే నెల రోజుల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జనసేన కౌన్సిలర్ రాము మాట్లాడుతే తాను కౌన్సిలర్ అయి రెండున్నరేళ్లయిందని, ఇంతవరకు వార్డులో స్పీడు బ్రేకర్లు కూడా వేయించ లేకపోయానని ఈ పదవీ ఎందుకని ఆక్రోశం వెలిబుచ్చారు. అధికారులు తాము ప్రతిపాదించిన పనుల ఆమోదం కోసం కౌన్సిలర్లు కావాలని, కౌన్సిలర్లు కోరిన పనులు మాత్రం పట్టవని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ జోక్యం చేసుకుని స్పీడు బ్రేకర్లు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే వాటిని అమర్చాలని డీఈ ఖలీంను ఆదేశించారు.

డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై కౌన్సిల్ హర్షం

పేటలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుపై టీడీపీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మీ సమావేశంలో ప్రస్తావించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు చెబుతు కౌన్సిల్ సమావేశం తీర్మానించాలని కోరారు. అజెండాలో లేని అంశంపై తీర్మానం ఏమిటని ప్రతిపక్ష కౌన్సిలర్ వట్టెం అభ్యంతరం చెప్పగా, అభివృద్ధి చేయటం చేతకాదని, చేసేవారిని అభినందించటానికి ఇబ్బందేమిటని రామలక్ష్మీ ప్రశ్నించారు. కమిషనర్‌గా వచ్చిన స్వల్పకాలంలో పురపాలకసంఘ ఆదాయం, పన్ను వసూళ్లలో అద్భుత పనితీరు కనబరిచిన కమిషనర్ రామ్మోహన్‌ను చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర కౌన్సిలర్లు ప్రశంసలు కురిపించారు. 16వ ఆర్థికసంఘం తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న చైర్మన్ రాఘవేంద్రను కౌన్సిల్ అభినందించింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది చైర్మన్‌లో ఒకరిగా తనకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విలువైన సూచనలు, సలహాలిచ్చారని ప్రశంసించారు. చైర్మన్ రాఘవేంద్ర తాను చేసిన సూచనలతో 16వ ఆర్థికసంఘ నిధులు 50 శాతం పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మనమిత్రపై అవగాహన కల్పించండి: కలెక్టర్

కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యాప్ ఆధారిత డిజిటల్ వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా ప్రజలకు 500పైగా సేవలందిస్తోందని, అందులో అందుబాటులోని పారిశ్రామిక సేవలపై పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకోవాలని ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ సమావేశంలో పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులపై చర్చించారు. ఏప్రిల్ 1 నుంచి మే 26 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 824 దరఖాస్తులు స్వీకరించగా, 762 ఆమోదం పొందాయని అధికారులు వివరించగా, మిగిలిన వాటిని కూడా గడువుకు ముందే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మాట్లాడుతూ వేగవంతమైన పారిశ్రామిక వృద్ధి లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఇన్‌చార్జి జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో దెబ్బతిన్న రెవెన్యూ వ్యవస్థ

● ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు



విజయవాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): అనేక దశాబ్దాలుగా గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ అనేక రూపాంతరాలు చెందడంతో బాగా దెబ్బతిందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవోపై జీవో నెం.4 వారితో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయ రేషనలైజేషన్లో భాగంగా గతంలో ఉన్న 15వేల గ్రామ, వార్డు సచివాలయాల స్థానంలో హేతుబద్దీకరణలో 7,500 సచివాలయాలుగా మారుస్తూ ప్రభుత్వం జీవో తీసుకొచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ప్రభుత్వ భూముల సంరక్షకులుగా, ఎలక్షన్ విధులు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రెవెన్యూ ఉద్యోగులను తగ్గించడం వల్ల సకాలంలో రెవెన్యూ సేవలు ప్రజలకు అందవన్నారు. వీరిని ఆయా మండల తహసీల్దార్ ఆధీనంలో పనిచేసే లా ఉత్తర్వులివ్వాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయశాఖ అధికారి కాటమనేని భాస్కర్‌కు లేఖ ఇచ్చారు. దీనికి భాస్కర్ సానుకూలంగా స్పందిస్తూ రెవెన్యూ, సర్వేయర్లను రెవెన్యూ శాఖలోనే కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్టు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. కోన ఆంజనేయకుమార్, రామిశెట్టి వెంకటరాజేష్, జి.అనుపమ పాల్గొన్నారు.

వంశీ అనుచరుడు రంగా కోర్టుకు తరలింపు

హనుమాన్‌జంక్షన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపట్టాల పంపిణీ కేసులో రెండు రోజుల పాటు కస్టడీ తీసుకున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి రంగాను జంక్షన్ పోలీసులు మంగళవారం తిరిగి నూజివీడు కోర్టులో హాజరు పరిచారు. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో ఏ7 నిందితుడిగా విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రంగాను సోమవారం జంక్షన్ సీఐ సత్యనారాయణ మూర్తి కస్టడీకి తీసుకున్నారు. జంక్షన్‌లో 2019లో నమోదైన ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు 10మందిపై కేసు నమోదు చేశారు. అందులో గన్నవరానికి చెందిన జాస్తి ఫణిశేఖర్, కొట్లు శేషుకుమార్ పరారీలో ఉన్నారు. పెరికీడు గ్రామానికి చెందిన మరో నిందితుడు లావేటి నారాయణ మృతి చెందాడు. రెండు రోజుల పాటు సీఐ దాదాపు 30 ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. కొన్ని ప్రశ్నలకు తెలియదు, మరి కొన్ని ప్రశ్నలకు సంబంధం లేదని నిందితుడు చెప్పినట్టు సమాచారం. నిందితుడి తరుపు లాయర్ స్రవంతి, బాపులపాడు వీఆర్వో గాబ్రియేలు సమక్షంలో సీఐ విచారణ జరిపారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు రంగాను తిరిగి నూజివీడు సెకండ్ ఏజేఎఫ్‌సీఎం కోర్టులో న్యాయమూర్తి ఎదుట జంక్షన్ ఎస్సై వి.సురేశ్ హాజరు పరిచారు. అనంతరం రంగాను విజయవాడ జైలుకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

సీఎం సాయం పేద కుటుంబాలకు ఆసరా

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదకుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందని టీడీపీ పట్టణాధ్యక్షు దింట్యాల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో 11వ వార్డుకు చెందిన పేద ముస్లిం కుటుంబానికి రూ.90వేల సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, సయ్యద్ గఫార్, సయ్యద్ జబీన్, బాధిత కుటుంబసభ్యులు షేక్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు జగన్మోహనరావు


కౌతవరంలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : కౌతవరంలో ఉచిత నేత్రవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. స్థానిక జనసేన, గుడివాడ లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మందికి కంప్యూటరైజ్డ్ సాంకేతిక పరికరాలతో నేత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తూము వెంకటరత్నం, తూము శంకర్, మత్తి నాగన్నపాల్గొన్నారు.

ఘనంగా గజేంద్ర పుట్టినరోజు వేడుకలు

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జనసేన గుడివాడ మండలాధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గజేంద్రలు కేకును కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, కోసూరి ఆంజనేయులు, పూర్ణ, చంటి, రవికుమార్, నీలా సాయికృష్ణ, కల్యాణి, భవాని, దుర్గ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు


కూచిపూడిలో మహానాడుకు తరలివెళ్లిన నేతలు

కూచిపూడి : వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతోపాటు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, మొవ్వ మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, విచారపు శ్రీనివాసరావు, చిందా పవన్ కుమార్, మండలంలోని పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు.


పమిడిముక్కల మండలం నుంచి మహానాడు పండగకు తరలి వెళుతున్న టీడీపీ నాయకులు

పమిడిముక్కల : కడపలో కొనసాగుతున్న మహానాడు పసుపు పండుగకు పమిడిముక్కల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దయెత్తున తరలివెళ్లారు. మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, ఎంపీ సుబయ్య తదితర నాయకుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ 43 వసంతాల మహోత్సవ సంబరాలకు తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా జై ఎన్టీఆర్, జై చంద్రబాబు, జై లోకేశ్ అంటూ నినాదాలతో వేడుకగా తరలి వెళ్లారు.

గుడ్లవల్లేరు : కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో గుడ్లవల్లేరు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, మండల టీడీపీ సమన్వయకర్త అడుసుమిల్లి రామ్మోహనరావు(చంద్రాల చిట్టిబాబు), పెంజంద్ర మాజీసర్పంచ్ బొప్పన శివప్రసాద్, జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి అడుసుమిల్లి వెంకటరమణ, అట్లూరి శ్రీరామచంద్ర ప్రసాద్, నీటిసంఘం అధ్యక్షుడు చలసాని శ్రీధర్, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు, గోవాడ శివ మరికొందరు కార్యకర్తలు,నాయకులు హాజరయ్యారు.

పామర్రు: వైఎస్సార్ కడపజిల్లాలో నిర్వహిస్తున్న టీడీపీ మహానాడు కార్యమానికి పామర్రు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా టీడీపీ శ్రేణులతో కలసి మెదటి రోజు జరుగుతున్న మహానాడులో కార్యక్రమానికి మంగళవారం హాజరయ్యారు..

పెదపారుపూడి : మహానాడు కార్యక్రమానికి పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు మంగళవారం పెదపారుపూడి మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) ఆధ్వర్యంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మసిముక్కు రాంబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యులు చిలకా ఆంజనేయులు, కలపాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మహానాడు కార్యక్రమానికి తరలివెళ్లిన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తదితరులు


పెదపారుపూడిలో మహానాడుకు వెళ్తున్న టీడీపీ నేతలు


ప్రొక్లయిన్‌తో విద్యుత్ స్తంభాన్ని నిలబెడుతున్న సిబ్బంది

ఎట్టకేలకు విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-ముదినేపల్లి రహదారిలో కొత్త చౌటపల్లి వద్ద కాలువలోకి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు నిలబెట్టారు. ఇప్పటికే ఒకసారి ఒరిగిన స్తంభాన్ని సరిచేసిన, ఇటీవల కురిసిన వర్షానికి స్తంభం మళ్లీ కాలువలోకి ఒరిగింది. ప్రొక్లయిన్ సహాయంతో విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టారు. విద్యుత్ స్తంభం ఒరిగిపోకుండా ఉండేందుకు మరో స్తంభాన్ని అసరాగా నిలబెట్టారు. ఈ స్తంభం ఒరిగిపోవడంతో మల్లాయిపాలెం రక్షిత మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి స్తంభాన్ని సరిచేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

● డీఎస్పీ వి.ధీరజ్ వినీల్

పామర్రు, మే 27 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విజయవాడ ప్రదాన జాతీయరహదారిపై తరచుగా సంభవించే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ అన్నారు. ప్రమాదాలకు నిలయంగా ఉన్న కనుమూరు, కురుమద్దాలి, బల్లిపర్రు అడ్డరోడ్డు, జజ్జవరం, కోండిపర్రు అడ్డరోడ్డుతోపాటు నిడుమోలు మసీదు సెంటర్, గోపవానిపాలెం అడ్డరోడ్డు ప్రాంతాలను మంగళవారం స్థానిక సీఐ సుభాకార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర ప్రదేశాల్లో తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు, సోలార్ బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారులశాఖకు సూచించారు. జాతీయ రహదారిపై రాత్రి సమాయాల్లో విధిలైట్లు వెలగకపోవడంతోపాటు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ఈరహదారిపై ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు అన్నిరికార్డులను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పామర్రు, పమిడిముక్కల, కూచిపూడి ఎస్సైలు వి.రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.


డేంజర్ ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

మేలు రకమైన వరి విత్తనాలు సిద్ధం చేసుకోవాలి

● ఏవో అనంతలక్ష్మీ

గుడివాడ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో మేలు రకమైన వరి విత్తనాలు సిద్ధం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. మల్లాయిపాలెంలోని కృష్ణవేణి సీడ్స్ ఫెర్టిలైజర్స్ గోడౌన్‌ను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ సీడ్స్ ద్వారా 2 వేలకు పైగా క్వింటాళ్ల వరి విత్తనాలు గుడివాడలో అమ్మకాలు జరుగుతాయని తెలిపారు. ప్రతీ రైతు ముందుగా వరి విత్తనాలు విత్తన షాపుల్లో కొనుగోలు చేసినప్పుడు విత్తనాలను ముందుగా మొలక శాతం చూసుకోవాలని తెలిపారు. 100 గింజలు వేరి ఒక బౌలులో పోసి ఎన్ని గింజలు మొలిచాయో చూడాలన్నారు. 80 గింజల వరకు మొలక వస్తే అవి వరి విత్తనాలుగా ఉపయోగించుకోవాలని తెలిపారు. వరి గింజలు తక్కువ శాతంగా వస్తే అవి నాణ్యమైనవి కాదని తెలిపారు. ప్రైవేట్ సీడ్స్ దగ్గర వరి విత్తనాలు తీసుకున్న రైతులు లేబుళ్లు, బ్యాగ్, రశీదు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా పంట దిగుబడి రానప్పుడు సీడ్స్ కంపెనీల నుంచి నష్టపరిహారం పొందాలంటే ఇవి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వి.అనిత, వ్యవసాయ శాఖ సిబ్బందిపాల్గొన్నారు.


వరి విత్తనాల గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఏవో అనంతలక్ష్మి

వృద్ధులకు అన్నదానం

గుడివాడ, మే 27(ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కలవకలపల్లి గ్రామస్థుడు తాతా సాయిమురళీకృష్ణ, నాగలక్ష్మీ దంపతుల కుమారుడు రేవంత్ సత్యశివరామ్ 8వ జన్మదినం సందర్భంగా స్థానిక మమత వృద్ధాశ్రమం, కరుణాపీఠం, కర్ల వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అల్పాహారం, అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. టూటౌన్ సీఐ చల్లా నాగప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరికుమార్, సభ్యులు మునీంద్ర, తాతారావు, మాజీ కౌన్సిలర్ పోతురాజు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఒకరి మృతి

గుడివాడ రూరల్: వ్యాపారంలో నష్టం రాగా ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వలివర్తిపాడులో చోటుచేసుకుంది. వలివర్తిపాడు బైపాస్ వద్ద ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వీర్ల గణేష్ బాబు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై డి.ఎన్.వి.వి.కృష్ణారావు మంగళవారం తెలిపారు. జి.రమణ, తన భర్త వీర్ల గణేష్ బాబు పార్టనర్‌లుగా అపార్ట్‌మెంట్లు కడతారని వ్యాపారంలో నష్టం రావడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన భార్య శివజ్యోతి తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

రాయితో దాడి .. కేసు నమోదు

గుడివాడ : తన చెల్లిని ఏడిపిస్తున్నారంటూ అడగడానికి వెళ్లిన వ్యక్తిపై రాయితో దాడి చేసి గాయపరిచిన సంఘటన స్థానిక కాకర్ల వీధిలో చోటుచేసుకుంది. స్థానిక కాకర్ల వీధికి చెందిన దావాల కిరణ్ తన చెల్లిని మండి చిన్న శ్రీను మేనల్లుడు ఏడిపిస్తున్నాడంటూ శ్రీను వద్దకు వెళ్లి చెప్పాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి కిరణ్‌పై రాయితో చిన్న శ్రీను దాడి చేశాడు. తలకు గాయమవ్వడంతో కిరణ్‌ను చికిత్స నిమిత్తం ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.బాబురావు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఝాన్సీరాణి

పామర్రు, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞానం అందించే భాండాగారాలని గ్రంథాలయాధికారి ఎం. ఝాన్సీరాణి అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మేథోశక్తి పెంపొందించడానికి దోహదపడే చిత్రలేఖనం, గణితం సబ్జెక్టులపై మక్కువ చూపాలన్నారు. జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు గ్రంథాలయాధికారి వి.సురేష్ నిర్వహించారు.

పెదపారుపూడి : పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బృంద చర్చపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాన్ని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ సందర్శించారు. ఎం.వి.ఎస్.లక్ష్మీపాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వివిధ పోటీలపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. హరిశ్చంద్ర మహారాజు గొప్పతనాన్ని వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావులు వివరించారు. గ్రంథాలయాధికారి శాంతి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఎదురు రహదారిలో పిచ్చి దొండతీగ విద్యుత్ స్తంభంపైకి ఎగబాకింది. ఎప్పుడు ఏ ప్రమాదం భారీన పడుతామోనని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రతిరోజు ఈ రహదారి గుండా మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవని స్థానికులు వాపోతున్నారు.


విద్యుత్ స్తంభంపైకి ఎగబాకిన పిచ్చి దొండతీగ

బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసమే కిశోరి వికాసం

పామర్రు, మే 27 (ఆంధ్రజ్యోతి): యుక్తవయస్సులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్తు కోసమే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కిశోరి వికాసం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ జిల్లా బాలిక సంరక్షణ శాఖలీగల్‌సెల్ ప్రొబిషన్ అధికారి వల్లె శైలజ అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూతక్కి సత్యశ్రీ అధ్యక్షతన స్థానిక కోటిరెడ్డిపేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు, తల్లులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహలకు పాల్పడడం చట్టరీత్యానేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలకు జరుగుతున్న సమాచారాన్ని తక్షణమే పోలీసులకుగానీ, లేదా ఐసీడీఎస్ వారికి అందించడం పౌరులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. సీడీపీవో భానుశ్రీ, సూపర్‌వైజర్లు సత్యశ్రీ, ఎస్ విజయకుమారి, మహిళ సంరక్షణ కార్యదర్శులు స్వాతి, అరుణ పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న శైలజ,భానుశ్రీ

పెదపారుపూడి : కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేసిందని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. మంగళవారం భూషణగుళ్ల అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ పి.నాగలక్ష్మీ, ఏఎన్ఎం వాణి, తదితరులు పాల్గొన్నారు.


పెదపారుపూడిలో..

నందివాడ : ఇంటర్ నెట్ ఇతర ఆన్‌లైన్ ప్లాట్ ఫారముల ద్వారా జరిగే మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడీ సూపర్‌వైజర్లు భవాని, నాగ శిరీష పేర్కొన్నారు. నందివాడ, జనార్ధనపురం , తుమ్మలపల్లి, పుట్టగుంట, పెదలింగాల, కుదరవల్లి, తమిరిశ, పోలుకొండ, అనమనపూడి పలు గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడి సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. కైకాల సత్యనారాయణ కళామందిరంలో మనుసేవా సంఘం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీవరకు నిర్వహిస్తున్న యోగా క్లాసులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గుడ్లవల్లేరులో యోగాడే నిర్వహించారు. అంగలూరు జిల్లాపరిషత్ పాఠశాల పీడీ సధ్యారాణి యోగాశిక్షణ ఇచ్చారు. మంగళవారం నుంచి వారంరోజులపాటు ఉదయం యోగాశిక్షణ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల వారందరూ హాజరవ్వవచ్చని ఎంపీడీవో టి.విజయసారథి తెలిపారు.

కూచిపూడి: మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో ఐదు రోజులపాటు జరిగే యోగా శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొవ్వ మండలంలో 144 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, తొలి రోజు 60 మంది శిక్షణకు హాజరయ్యాని మండల విద్యాశాఖాధికారిణి -2 కె.శ్రీలక్ష్మీ తెలిపారు. వీరికి ఫిజికల్ డైరెక్టర్లు బి.నాగ శివ, పి.ఎస్.బసవయ్య మాస్టర్స్ ట్రైనర్లుగా పాల్గొని శిక్షణ ఇచ్చారు.

నందివాడ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం నందివాడ - కొండపల్లి కన్వెన్షన్ హాల్లో మెగా విలేజ్ ట్రైనర్సుకు మండల ఎంపీపీ పెయ్యల ఆదాము, ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఏవో కోటేశ్వరరావు, మాస్టర్స్ ట్రైనర్లు జె.శ్రీనివాసరావు, బి.అనిత,పాల్గొన్నారు.

పమిడిముక్కల : యోగాంధ్ర మాసోత్సవాన్ని పురస్కరించుకుని పమిడిముక్కలలో మంగళవారం మండలస్థాయి యోగా కమిటీ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వీరంకిలాకు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు ఎంపీడీవో వి.సీతారామరాజు, డి.వెంకటేశ్వరరావు,రామకృష్ణ, పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: లింగవరంలో యోగా డేను పురస్కరించుకుని మంగళవారం ఉదయం తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. యోగా ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.


వీరంకిలాకు సెంటర్‌లో యోగాంధ్ర అవగాహన మానవహారం


సింహాద్రి మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిరువ్యాపారులు

చెట్ల కొమ్మలు నరకొద్దని వినతి

గుడివాడ, మే 27 (ఆంధ్రజ్యోతి) : గత 60ఏళ్లగా ఆక్సిజన్, నీడను అందిస్తున్న చెట్ల కొమ్మలను నరకడం సబబు కాదని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్ల కొమ్మలను నరకవద్దని కోరుతూ చింతల కాలువ బజారులోని చిరువ్యాపారులు మంగళవారం గుడివాడ మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా చెట్ల కింద వ్యాపారాలు చేసుకుంటున్నామని చిరువ్యాపారులు అంటున్నారు. చెట్ల కొమ్మలను నరికిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, చెట్ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని చిరువ్యాపారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పి.శేఖర్‌బాబు, బత్తుల గోవిందు, వేములపల్లి మార్కు, కుమార్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

లోకేశ్‌ను టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేయాలి : మోర్ల

చల్లపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి) : యువనేత నారా లోకేశ్‌ను టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ మహానాడులో విజ్ఞప్తి చేశారు. సంక్షేమ నిధి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి కార్యకర్తలకు అండగా నిలవడంతో పాటు సభ్యత్వ నమోదులో రికార్డు సాధించడం యువనేత లోకేశ్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలనే ఆకాంక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో బలంగా ఉందన్నారు.



బందరులో యోగా శిక్షణా తరగతుల్లో వృక్షాసనం వేస్తున్న ఎంపీడీవో వెంకటేష్



కానూరులో యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న గోపు సత్యనారాయణ, ఉద్యోగులు



పెడన మార్కెట్ యార్డులో యోగాసనాలు వేస్తున్న కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో



గూడూరులో యోగా శిక్షణలో పాల్గొన్న గ్రామస్థులు

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర విజయవంతానికి అందరం కృషి చేద్దామని ఎంపీడీవో వెంకటేష్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తనకు బాల్యం నుంచి సూర్యనమస్కారాలు చేసే అలవాటు ఉందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. నగర పాలక సంస్థ సచివాలయాల్లో యోగ శిక్షణా తరగతులు నిర్వహించారు. సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులతో డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు దస్రిక, కపాలభారతి, నాడి సిద్ధి ప్రాణాయామాలు, భుజంగాసనం వేయించారు. యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేద్దామని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. బందరు మండలం కానూరు గ్రామంలో మంగళవారం ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. దివి మహేష్, బొమ్మిడి పెద ఏడుకొండలు, గోపు వెంకటరమణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, బొమ్మిడి కొండా, ఈమన ఏసు, బోట్ల సాయి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెడన/పెడన రూరల్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం మండల స్థాయి యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు, ఎంపీడీవో ఏ. అరుణకుమారి, తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఎంఈవో-2 వై.వి. హరనాథ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఉద్యోగులుయోగా శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కమిషనర్ గోపాలరావు యోగా ప్రాముఖ్యతను, ప్రయోజనాలను వివరించారు. ఎంపీడీవో అరుణకుమారి, తహసీల్దార్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దైనందిన కార్యక్రమంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు.

గూడూరు : గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం గ్రామస్తులకు యోగా శిక్షణ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం. వనజ, డిప్యూటీ డీవైఈవో విజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఘంటసాల :** యండకుదురు సచివాలయం వద్ద యోగాపై సచివాలయ ఉద్యోగులకు, గ్రామస్థులు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. యోగా శిక్షకులు డి.శేషగిరిరావు, జి.మారుతి ఆసనాలు వేయించారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతీ రోజు యోగా చేయాలని సూచించారు. సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా, పంచాయతీ కార్యదర్శి యక్కటి సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **కోడూరు :** యోగా మాసోత్సవంలో భాగంగా మంగళవారం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని టీటీడీ కళ్యాణ మండపంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా శారీరక, మానసిక, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఎంపీపీ వెంకట కుమారి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఈవోపీఆర్డీ నాగరేవతి, ప్రసాద్, ఎంఈవో రామదాసు, గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, కోడూరు ఎస్సై చాణిక్య, బండే శ్రీనివాసరావు, కోట రాంబాబు, పిల్లి మల్లిఖార్జునరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **నాగాయలంక :** యోగాంధ్రలో భాగంగా నాగాయలంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం మండలంలోని సచివాలయ సిబ్బందికి యోగా టీచర్ ఈశ్వర్ శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పాఠశాల పీడీ గాజుల లక్ష్మీ ప్రసాద్, ఏపీఎం కె.ఏసుదాసు, ఏపీవో టి.వి.ఎన్. ముత్యాలు, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు. **అవనిగడ్డ :** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మరియ కుమారి అధ్యక్ష యోగా శిక్షణ నిర్వహించారు. మరియకుమారి మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. కోటేశ్వరరావు, శ్రీకాంత్, ఉదయ్ యోగాసనాలు వేయించారు. డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, వంగర శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కోడూరులో యోగా చేస్తున్న ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు



ఘంటసాల మండలం యండకుదురులో యోగా శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు



నాగాయలంకలో యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది



ఆదిత్య హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు

అవనిగడ్డ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులో సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు దివి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. చందన అలంకారంలో స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదిత్య హోమాన్ని నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమానికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల వితరణ

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్నేహాలయ వృద్ధాశ్రమానికి రూ.65 వేల విలువ గల 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను వితరణగా అందజేశారు. ఎస్.ఎల్. అనసూయాదేవి వృద్ధుల ప్రయోజనార్థం ఈ పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు, ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు.



తీరగ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు

నాగాయలంక, మే 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీర ప్రాంత గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేసి దాహార్తిని తీర్చుతున్నారు. మంగళవారం సంగమేశ్వరం, పాత ఉపకాలి గ్రామాల ప్రజలకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అన్నప్రసాద వితరణ జరిగింది. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, బడే పూర్ణచంద్రరావు, ఆమంచి వాసుదేవ హనుమంతరావు, దేసు సుబ్రహ్మణ్యం, కోకా సత్యనారాయణ, పి.నరేంద్ర పాల్గొన్నారు.



నాగాయలంక లైబ్రరీ పక్కనే దుర్గంధం వస్తున్న మరుగుదొడ్లు

మరుగుదొడ్ల నిర్వహణ పట్టని పాలకులు

● గ్రంథ పాఠకులకు నరకం

నాగాయలంక, మే 27 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక ప్రధాన రహదారిలోని గ్రంథాలయం ప్రహారీ చెంతన ఉన్న సామూహిక మరుగుదొడ్ల నుంచి దుర్గంధం వస్తోంది. మరుగుదొడ్లలోని వ్యర్థాలను తొలగించకపోవటంతో వర్షానికి కుళ్లి దుర్వాసనకు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు ముక్కు మూసుకుంటూ తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ఆరేళ్ల క్రితం ఓఎన్‌జీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా గ్రంథాలయం పక్కన లక్షలాది రూపాయలు వెచ్చించి నాలుగు మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. మొదటి నుంచి దాని నిర్వహణ బాధ్యతలను పంచాయతీ గానీ, ఓఎన్‌జీసీ యాజమాన్యం గానీ పట్టించుకోకపోవటంతో అవి నిరర్థకంగా మారాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం దుర్వాసన కొడుతున్న సామూహిక మరుగుదొడ్లను ప్రక్షాళన చేయాలని గ్రంథాలయ పాఠకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



పాలకాయితిప్పలో మెరైన్ పోలీసులు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీష



పులిగడ్డలో కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్

కోడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి) : మెరైన్ ఉన్నతాధికారుల సూచనల మేరకు పాలకాయితిప్ప గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించిందని మెరైన్ సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష, వైద్య బృందం గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్సై పూర్ణ మాధురి, మెరైన్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పంచాయతీ కార్యదర్శి బి.అనిత శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ కిషోర్ కుమార్ (అప్తమాలజీ) ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు తక్కువ ధరకే చేయనున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వార్డుసభ్యులు చెన్ను రమేష్, లీలా కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల శిబిరంపై దాడి

● నలుగురి అరెస్టు

మోపిదేవి, మే 27 (ఆంధ్రజ్యోతి) : పెదప్రోలు పంచాయతీ శివారు కె.కొత్తపాలెం డొంక రోడ్డులో కోడిపందాల శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై.వి.సత్యనారాయణ తెలిపారు.

అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీకి వచ్చిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం దాడి చేసి కోడిపందేలు వేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని అధధఖలోకి రూ.2200 నగదు, కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీ అయ్యారన్నారు.

సుందరకృష్ణకు పితృవియోగం

మచిలీపట్నం టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య వైకె సుందరకృష్ణకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి వైకె దేశికాచార్యులు అనారోగ్యంతో మంగళవారం మచిలీపట్నంలో మృతి చెందారు. దేశికాచార్యులు భౌతికకాయాన్ని కృష్ణా వర్సిటీ వీసీ ఆచార్య కూన రాంజీ సందర్శించి నివాళులర్పించారు.

ఏపీఈఏపీసెట్‌కు 170 మంది హాజరు

పెడన రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ (ఇంజనీరింగ్) పరీక్షకు మంగళవారం 170 మంది హాజరయ్యారని అడ్మిన్ పి అశోక్‌కుమార్ తెలిపారు.